www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 28 ఫిబ్రవరి 2024
5
పశ్చిమ గోదావరి

నేడు భీమవరంలో సిఎం జగన్ పర్యటన

కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

ప్రజాశక్తి - భీమవరం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బుధవారం భీమవరంలో పర్యటించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి జగన్ హెలీకాప్టర్‌లో బయల్దేరి బుధవారం సాయంత్రం పెదఅమిరంలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారని పేర్కొన్నారు. అక్కడి నుండి పెదఅమిరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్‌కు చేరుకుని పాలకొల్లు వైసిపి నేత గుణ్ణం నరసింహానాగేంద్రరావు (నాగబాబు) కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదిస్తారని తెలిపారు. అనంతరం తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి హెలీకాప్టర్‌లో బయల్దేరతారని పేర్కొన్నారు.

సహకరించను.. వెళ్లిపో..!

ఎంఎల్ఎ రామరాజు కరచాలనానికి స్పందించకుండా మౌనంగా ఉండిపోయిన మాజీ ఎంఎల్ఎ శివ

- ఎంఎల్ఎ రామరాజుకు తెగేసి చెప్పిన మాజీ ఎంఎల్ఎ శివరామరాజు
- రెండేళ్లు అవమానించి.. నా వాళ్లను భయపెట్టారు
- ఇప్పుడు మద్దతు కోరేందుకు రావడం న్యాయమేనా
- ఉండి మాజీ ఎంఎల్ఎ శివరామరాజు
- వైసిపిలో చేరనున్న శివరామరాజు!

ప్రజాశక్తి - భీమవరం

ఉండి కంచుకోట టిడిపిలో ఏర్పడిన అసంతృప్తి అలజడి రోజురోజుకీ అగ్నిజ్వాలలా రగులుతోంది. ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు మధ్య జరుగుతున్న టిక్కెట్ రగడ తారాస్థాయికి చేరింది. ఉండి ఎంఎల్ఎ స్థానాన్ని మాజీ ఎంఎల్ఎ శివరామరాజు ఆశించారు. అయితే సిట్టింగ్ ఎంఎల్ఎ రామరాజుకు టిక్కెట్ కేటాయించింది. దీంతో టిడిపి అధిష్టానంపై శివరామరాజు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. అయితే శివరామరాజు మద్దతు కూడగట్టేందుకు భీమవరంలో శివ కార్యాలయానికి మంగళవారంనాడు ఎంఎల్ఎ రామరాజు తన సోదరుడు నరసింహరాజుతో కలిసి వెళ్లారు. శివరామరాజు ఎదురుగానే కూర్చున్నప్పటికీ చాలాసేపు రామరాజు, శివరామరాజు ఇరువురు మౌనంగానే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ రామరాజు శివరామరాజుని 'అన్నయ్యా.. నీతో మాట్లాడటానికి వచ్చాను' అంటూ ఆయన పక్కన కూర్చున్నారు. వెంటనే శివరామరాజు అక్కడ నుంచి పైకి లేచి 'నువ్వు వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపో.. నీకు సపోర్టు చేసేది లేదు' అని తెగేసి చెప్పారు. దీంతో ఖంగుతిన్న రామరాజు అక్కడి నుంచి అవమాన భారంతో వెనుదిరిగారు. ఇదే సందర్భంలో మీడియాతో ఎంఎల్ఎ రామరాజు మాట్లాడే ప్రయత్నం చేయగా 'నా అనుమతి లేకుండా.. నా కార్యాలయంలో మాట్లాడటం కుదరదు' అని శివరామరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడున్న కార్యకర్తలు పెద్దఎత్తున శివరామరాజు అనుకూలంగా నినాదాలు చేశారు.

టిడిపి నమ్మించి గొంతు కోస్తే.. ఎంఎల్ఎ రామరాజు వంచించారు

20 ఏళ్లపాటు టిడిపికి విధేయునిగా ఉండి టిడిపి అభివృద్ధితోపాటు కేడర్‌ను కాపాడుకుంటూ వస్తున్నానని, అయితే టిడిపి నమ్మించి గొంతు కోస్తే.. ఎంఎల్ఎ రామరాజు వంచించారని మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. 2004లో కలిదిండి అబ్బాయిరాజు మద్దతు పొంది, 2005లో శివ స్వచ్ఛంద సేవా సంస్థను నెలకొల్పి ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేశానన్నారు. 2006లో టిడిపిలో చేరి 2009లో టిడిపి తరపున బరిలోకి దిగి గెలుపొందానని, 2014లో మళ్లీ ఎంఎల్ఎగా గెలుపొందానని చెప్పారు. 2019లో జరిగిన ఎన్నికల్లో పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు నరసాపురం ఎంపీగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందానన్నారు. పార్టీకి ఇంత విధేయతగా పని చేసినప్పటికీ తనను కనీసం సంప్రదించకుండా రామరాజుకు టిక్కెట్ కేటాయించి పార్టీ అధిష్టానం తనను ఘోరంగా అవమానించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల నుంచి ఎంఎల్ఎ రామరాజు తనను అనేక అవమానాలకు గురి చేశారన్నారు. చివరకు తన పేరును తలుస్తున్న వారిని సైతం భయభ్రాంతులకు గురి చేశారన్నారు. తన హృదయం అగ్నిగోళంలా మండుతున్నా పార్టీ కోసం అన్నీ దిగమింగుకుని భరించానని తెలిపారు. ఇప్పుడు ఎంఎల్ఎ రామరాజు మద్దతు కోసం తన వద్దకు వచ్చి 'మా అన్నయ్య.. మా కుటుంబం' అంటూ బంధుత్వాలు కలపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం డబ్బు, అహంకారంతో రామరాజు పేట్రేగిపోతున్నారని విమర్శించారు. ప్రజాభీష్టం మేరకు రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తానని స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెంలో జరగబోయే టిడిపి, జనసేన ఉమ్మడి సభకు తనకు ఆహ్వానం అందలేదన్నారు. మంగళవారం భీమవరంలో జరిగిన టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశానికి కూడా ఆహ్వానం అందలేదని చెప్పారు.

వైసిపిలో చేరే యోచనలో శివరామరాజు..!

ఉండి మాజీ ఎంఎల్ఎ శివరామరాజు వైసిపిలో చేరే యోచనలో ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. శివరామరాజు తనకు టిక్కెట్ విషయంలో జరిగిన అన్యాయానికి, పార్టీ వ్యవహరించిన తీరుకు తీవ్ర మనస్తానికి గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి వైసిపిలో చేరనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. శివ తన నిర్ణయాన్ని బుధవారం ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. అయితే వైసిపిలో చేరితే ఆయన ఉండి నుంచే పోటీలో ఉంటారా లేక భవితవ్యం ఏమిటనే దానిపైనా పెద్దఎత్తున చర్చ సాగుతోంది.

టిక్కెట్.. తిరుగుబాటు..!

- టిడిపి, జనసేన నేతల్లో అసంతృప్తి తారాస్థాయికి
- ప్రకటించిన ఏడు స్థానాల్లో నాలుగుచోట్ల తిరుగుబావుటా
- ఉండి, తణుకు, ఏలూరులో నేతల ఆగ్రహ జ్వాలలు
- శివరామరాజు వైసిపిలోకి వెళ్లనున్నట్లు ప్రచారం
- తణుకులో విడివాడ రచ్చతో అంతర్మథనంలో జనసేన
- కాంగ్రెస్‌తో జతకట్టే యోచనలో రెడ్డి అప్పలనాయుడు?
- నాకు అన్యాయం చేశారంటూ ప్రజల్లోకి ముద్రబోయిన

విడివాడ రామచంద్రరావుకు సర్దిచెబుతున్న జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిక్కెట్ దక్కని టిడిపి, వైసిపి నేతలు అధిష్టానంపై తిరుగుబాటుకు దిగారు. కష్టపడి పనిచేసిన తమకు అధినాయకులు అన్యాయం చేశారంటూ మండిపడుతున్నారు. దీంతో టిడిపి, జనసేన అధిష్టానాలు తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. పొత్తులో భాగంగా టిడిపి తరపున ఏడు స్థానాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉండిలో టిడిపి సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజుకే మరోసారి టిక్కెట్ ఇచ్చారు. తనకు మద్దతుగా నిలవాలని ఎంఎల్ఎ రామరాజు ఆయన మద్దతు కోరినా.. లేదంటూ ఖరాఖండిగా చెప్పేశారు. టిక్కెట్ ఇస్తే వైసిపిలో చేరేందుకు శివ పావులు కదుపుతున్నట్లు సమాచారం. 2019 ఎన్నికల్లో వైసిపి నుంచి పివిఎల్.నర్సింహరాజు పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తర్వాత నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో పివిఎల్‌కు కాదని వైసిపి శివరామరాజుకు టిక్కెట్ ఇస్తుందా అనే చర్చ నడుస్తోంది. వైసిపి టిక్కెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీచేసి ఓట్లు చీల్చి మంతెన రామరాజును ఓడించాలనే లక్ష్యంతో శివరామరాజు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. తణుకు టిడిపి అభ్యర్థిగా ఆరిమిల్లి రాధాకృష్ణ పేరు ప్రకటించగానే జనసేన నుంచి టిక్కెట్ ఆశించిన విడివాడ రామచంద్రరావు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. తాడేపల్లిగూడెంలో జరగనున్న టిడిపి, జనసేన ఉమ్మడి సభ ఏర్పాట్ల పరిశీలనకు విచ్చేసిన జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఎదుట విడివాడ అనుచరులు నిరసన తెలిపి రచ్చ చేసిన సంగతి తెలిసిందే. విడివాడ ఇండిపెండెంట్‌గా పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఏలూరులో టిడిపి నుంచి బడేటి చంటికి టిక్కెట్ ఖరారు కావడంతో జనసేన నుంచి టిక్కెట్ ఆశించిన రెడ్డి అప్పలనాయుడు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. అప్పలనాయుడు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారని, లేకపోతే కాంగ్రెస్‌లో చేరి బరిలోకి దిగుతారని ప్రచారాలు సాగుతున్నాయి. నూజివీడు టిక్కెట్‌ను వైసిపి నుంచి టిడిపిలో చేరిన పెనమలూరు ఎంఎల్ఎ కొలుసు పార్థసారధికి కేటాయించారు. దీంతో టిడిపి నుంచి టిక్కెట్ ఆశించిన ముద్రబోయిన వెంకటేశ్వరరావు అసంతృప్తితో ఉన్నారు. ఇండిపెండెంట్‌గానైనా పోటీ చేస్తానంటూ సహచరుల వద్ద అంటున్నట్లు తెలుస్తోంది. తనకు టిడిపి అన్యాయం చేసిందంటూ ప్రజల్లోకి వెళ్తూ ప్రచారం సాగిస్తుండటం విశేషం. రెండు జిల్లాల్లో టిడిపి అభ్యర్థులను ప్రకటించిన ఏడుస్థానాల్లో నాలుగు స్థానాల్లో నాయకుల తిరుగుబాటు కొనసాగుతోంది. రెండుచోట్ల సొంత పార్టీ నుంచే తిరుగుబాటు ఎదురవుతుండగా, మరో రెండు చోట్ల జనసేన నేతల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో పొత్తు సవ్యంగా సాగుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

తొందరపడకు శివ.. న్యాయం జరుగుద్ది

- ఏ పార్టీలోకి వెళ్లకు, ఇండిపెండెంట్‌గా పోటీ చేయకు
- శివరామరాజును బుజ్జగించిన మాజీ ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం

ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజును భీమవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మంగళవారం రాత్రి శివరామరాజు పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంఎల్ఎ స్థానాన్ని ఆశించి భంగపాటుకు గురైన మాజీ ఎంఎల్ఎ శివరామరాజు టిడిపి అధిష్టానం, ఎంఎల్ఎ మంతెన రామరాజు వ్యవహార శైలి పట్ల అసమ్మతి రాగం వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అంజిబాబు శివ రామరాజును కలిసి బొజ్జగించినట్లు తెలిసింది. దీంతో శివ రామరాజు తన వేదనను వెళ్లబుచ్చారని తెలిసింది. ఎన్నో ఏళ్లగా పార్టీకి ప్రజలకు అనేక సేవలందిస్తే తనను కనీసం గుర్తించకుండా టిడిపి అవమానించిందని అంజిబాబు వద్ద వాపోయినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తొందరపడి ఏ పార్టీలోకి వెళ్లొద్దని, ఇండిపెండెంట్‌గా అసలు పోటీ చేయొద్దని, టిడిపి జనసేన పొత్తులో న్యాయం జరుగుతుందని శివరామరాజుకు అంజిబాబు భరోసా కల్పించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఎంఎల్ఎ రామరాజు శివరామరాజు కార్యానికి వచ్చి ఘోర పరాభవాన్ని ఎదుర్కొని అనంతరం అంజిబాబు వచ్చి శివరామరాజును బొజ్జగించడంతో రాజకీయంగా చర్చకు దారి తీసింది.

పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ బదిలీ

కొత్త కమిషనర్‌గా విజయసారధి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ శేషాద్రి బదిలీ అయ్యారు. ఇక్కడకు చీరాల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న విజయసారధి రానున్నారు. ఇప్పటివరకూ పనిచేసిన శేషాద్రి రేపల్లె కమిషనర్‌గా బదిలీ అయ్యారు. డిఎంఎ కార్యాలయం నుంచి బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. రాజకీయ పరిణామాల నేపథ్యంలోనే బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది.

సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల నిరసన

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - ఏలూరు

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ స్థానిక ఎన్‌జిఒ హోమ్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎపి జెఎసి ఉద్యమాన్ని అణగదొక్కాలని చూడటం దారుణమన్నారు. ఉద్యోగ సంఘ నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. దశలవారీ ఉద్యమిస్తామని, ఐనా ప్రభుత్వం దిగి రాకపోతే మెరుపు సమ్మె చేపడతామని హెచ్చరించారు. జెఎసి కన్వీనర్ నెరుసు రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాలా ఉద్యోగులను మోసగించిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి డిమాండ్లు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ట్రెజరీ ఉద్యోగుల జిల్లా కార్యదర్శి కప్పల సత్యనారాయణ, కె.నాగమణి, కె.సునీత, సత్యభారతి, పూడి శ్రీనివాస్, మాదాసు సాంబశివరావు, ఎమ్‌డి.బేగ్ పాల్గొన్నారు.

భీమవరంలో పవన్ పోటీ చేయకపోతే.. నేను పోటీ చేస్తా

- మరో రెండు రోజుల్లో జనసేనలో చేరతా
- మాజీ ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం

జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ భీమవరం నుంచి పోటీ చేయకపోతే తాను పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని భీమవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు తెలిపారు. తాను మరో రెండు రోజుల్లో జనసేన పార్టీలో చేరతానని వెల్లడించారు. స్థానిక బ్యాంక్ కాలనీలో ఉన్న తన నివాసంలో అంజిబాబు మంగళవారం మీడియాతో మాట్లాడారు. హైదరాబాదులో రెండు రోజుల క్రితం పవన్ కళ్యాణ్‌ను కలిసి గంటపాటు వివిధ రాజకీయ అంశాలపై చర్చించానన్నారు. ప్రస్తుత రాజకీయాలు భ్రష్టు పట్టుకుపోయాయని, దీన్ని రూపుమాపాలని తనకు సూచించారన్నారు. తాను భీమవరం నుంచి పోటీ చేసేది, లేనిది రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని పవన్ చెప్పారన్నారు. బిజెపితో సీట్ల సర్దుబాటు జరగాల్సి ఉందని, ఆపై తుది నిర్ణయం తీసుకుంటానని చెప్పారని తెలిపారు. తన ఎన్నికల్లో కష్టపడినట్లుగానే పవన్ కళ్యాణ్ గెలుపునకు రెట్టింపు కష్టపడి అత్యధిక మెజారిటీతో గెలిపించే బాధ్యతను తాను తీసుకుంటానని పవన్‌కు చెప్పానని తెలిపారు. ఒకవేళ భీమవరంలో పోటీ చేసే అవకాశం తమకు లభిస్తే తన కుమారుడు ప్రశాంత్ కాకుండా తానే పోటీలో ఉంటానని అంజిబాబు వెల్లడించారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

భార్య మృతి.. భర్తకు తీవ్ర గాయాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ శివార్లలో నరసాపురం రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా ఆమె భర్తకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం నర్సాపురం మండలం సీతారామపురానికి చెందిన మేడిది పెద నర్సింహస్వామి తన భార్య మేడిది వెంకట నరసమ్మ (55)తో కలిసి బైక్‌పై పాలకొల్లులోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ బంధువును పరామర్శించేందుకు వస్తున్నారు. పాలకొల్లు పట్టణ శివార్లకు చేరుకునేసరికి వీరిని వెనుక నుంచి ఆర్‌టిసి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట నరసమ్మ అక్కడికక్కడే మృతి చెందగా గాయాల పాలైన పెద నర్సింహస్వామిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పాలకొల్లు పట్టణ సిఐ మంగాదేవి నేతృత్వంలో ఎఎస్ఐ మార్లింగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై డిప్యూటీ కలెక్టర్ శివ నారాయణరెడ్డి

ఎన్నికలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎన్నికల నోటి ఫికేషన్ దగ్గర పడడంతో పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గంలోని అధికా రులు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ కలెక్టర్ శివ నారాయణ రెడ్డి చెప్పారు. పాలకొల్లు మున్సిపల్ కౌన్సిల్ హాల్లో నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులతో ఎన్నికల సమయాత్తంపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పలు శాఖల ఇంజినీర్లు, మున్సిపల్ అధికారులు హాజరయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి అధికారీ ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగిఉండాలని కోరారు. ఈ సమావేశంలో పాలకొల్లు, పోడూరు, యలమంచిలి మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను జయప్రదం చేయాలి

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - గణపవరం

మార్చి మూడో తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా వైద్య సిబ్బంది జయప్రదం చేయాలని జిల్లా వైద్య శాఖాధికారి మహేశ్వరరావు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మంగళవారం పిప్పర పిహెచ్‌సిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌ను, వార్డులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో నెలకు 5 ప్రసవనాలు జరిగే విధంగా సిబ్బంది స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం గురించి వివరణ అడగడంతో ఆసుపత్రి డాక్టర్ కె.ప్రియాంక మాట్లాడారు. 1953 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడానికి 27 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, హెచ్‌వి.సుబ్బలక్ష్మి స్టాఫ్ నర్స్ మేరీ, ఫార్మసిస్ట్ నాగమణి పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జయరామ్

సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎపి నిట్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డీన్ డాక్టర్ ఎన్.జయరామ్ సూచించారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ బిఎస్.మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో తణుకు మాంటిస్సోరీ విద్యార్థులు మంగళవారం నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ఇండోర్ స్టేడియం, ప్రయోగశాలలు, వర్క్ షాపులు, గ్రంథాలయాన్ని పరిశీలించి, యంత్రాలు, పరికరాల పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జయరామ్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఎవరైతే టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకుంటారో వారు ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకుంటారని తెలిపారు. బట్టీ చదువులు మార్కులు తెచ్చిపెడతాయేగాని విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దలేవని చెప్పారు. రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ వి.సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యూహాలే లక్ష్యంగా దూసుకెళ్లాలన్నారు. విద్యార్థుల్లో స్ఫూర్తినింపేలా భారత శాస్త్రవేత్తల విజయగాథలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ఐలు ఆధ్వర్యాన పోస్టు కార్డు ఉద్యమం

పోస్ట్ కార్డులతో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - తణుకు రూరల్

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాని కోరుతూ పోస్ట్‌కార్డు ఉద్యమం చేస్తున్నట్లు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ తెలిపింది. మంగళవారం తణుకులో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ , బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఉభయ జిల్లాల కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ భూ హక్కు యాజమాన్య చట్టం 27ను రద్దు చేయాలని మూడు నెలల నుంచి న్యాయవాదులు పోరాటం చేస్తున్నా, హైకోర్టును ఆశ్రయించినా ప్రభుత్వంలో చలనం లేదని అన్నారు. ఇది వైసిపి ప్రభుత్వ నిరంకుశ విధానమని విమర్శించారు. చట్టాన్ని రద్దు చేసే వరకూ ఆలిండియా లాయర్స్ యూనియన్ పోరాడుతుందని తెలిపారు. దీనిలో భాగంగానే ఐలు తరుపున పోస్ట్ కార్డు ఉద్యమం ద్వారా ప్రభుత్వాన్ని కదిలించాలన్నారు. దీనిలో న్యాయవాదులు, లబ్ధిదారులు, ప్రజల సహకారంతో కార్డులతో నిరసన ప్రభుత్వానికి తెలియజేస్తామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఐలు జిల్లా కమిటీ సభ్యులు కౌరు వెంకటేశ్వర్లు, న్యాయవాదులు ఎం.సత్యనారాయణ ఆచార్యులు, అనుకూల రమేష్ చింతపల్లి నాగేశ్వరరావు, ఎం.సువర్ణరాజు, మృత్యుంజయరావు, ఆర్.శ్రీనివాస్, పి.సిద్దు, బి.భాస్కరరావు, జి.నారాయణ, ఎస్.చిట్టి మోషే పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న పితాని సత్యనారాయణ

చంద్రబాబు, పవన్‌ను ఆశీర్వదించండి: పితాని

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు పవన్‌కళ్యాణ్‌ను ఆశీర్వదించాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం ఆచంట వేమవరంలో ప్రజల వద్దకు పితాని పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార దాహం, ధన అహంకారంతో ఉండే నాయకుడు కావాలా, ప్రజా సమస్యలు పట్టించుకుని అనునిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు కావాలో ప్రజలే తెలుసుకునే సమయం ఆసన్నమైందన్నారు. అరాచక పాలన సాగిస్తున్న జగన్‌రెడ్డిని, ఎంఎల్‌ఎ రంగనాథరాజు సాగనంపాలని పిలుపునిచ్చారు. లిక్కర్, ఇసుక, ల్యాండ్ మాఫియాలతో దోచుకోవడం, దాచుకోవడమే తప్ప ప్రజా సంక్షేమం తెలియని ముఖ్యమంత్రి జగన్ అన్నారు. ఎంఎల్‌ఎ రంగనాథరాజు తన సొంత డబ్బులతో అభివృద్ధి చేస్తున్నానని విష ప్రచారం చేస్తూ మరోవైపు ప్రభుత్వ నిధులు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి సెల్ నాయకులు కనపాల వెంకటేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షుడు కేతా మీరయ్య, ప్రధాన కార్యదర్శి ఏడిద శ్రీనివాస్, జనసేన మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ, కార్యదర్శి కాపవరపు రామకృష్ణ పాల్గొన్నారు.



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వ్యకాస నేతలు

రెల్లి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ గ్రామ పంచాయతీ పరిధిలోని రెల్లి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన మంగళవారం పంచాయతీ సిబ్బంది వి పెద్దిరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడారు. రెల్లి కాలనీలో అపరిశుభ్రం తాండవం చేస్తోందన్నారు. గత పది రోజులుగా రెల్లి కాలనీ ఎదురుగా ఉన్న పురుగుల మందుల వేపుల తాటేళ్ల చనిపోయి దుర్వాసన వస్తోందని, దీంతో ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీని ఆనుకుని ఉన్న మురుగు నీటి కాలువ వల్ల దోమలు విజృంభిస్తున్నాయని దీంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు నీలాపు ఆదినారాయణ, పండు, సుధీర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చినమిల్లి సత్యనారాయణరావు

విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు తెలిపారు. వైఎన్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు పాల్గొని మాట్లాడారు. కళాశాల జీవిత సమయం ఎంతో విలువైందన్నారు. ఇక్కడ నుంచే విద్యార్థుల ప్రయాణం ఆరంభమవుతుందన్నారు.ఎందుకంటే ఇక్కడ నేర్చుకున్న పాఠాలు, సంస్కారం, ప్రవర్తనపైనే మీరు సమాజంలో ఏ విధమైన పాత్ర పోషిస్తారనే విషయం అవగతమవుతుందని తెలిపారు. అల్లరి చిల్లరగా తిరిగితే లైఫ్ బాగుపడదన్నారు. అనంతరం విద్యార్థులకు మెరిట్ పత్రాలు, మెడల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి పోలిశెట్టి రఘురామరావు, గవర్నింగ్ బాడీ సభ్యులు చేగొండి సత్యనారాయణ మూర్తి, రెడ్డప్ప ధవేజీ, అకడమిక్ అడ్వయిజర్ ఆర్‌వి.సుబ్బారావు, కోసూరి సూర్య ప్రకాశ నారాయణ వర్మ పాల్గొన్నారు.

పోరాట యోధుడు చంద్రశేఖర్ ఆజాద్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కులాలు, మతాలకు అతీతంగా బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని అంతమొందించిన యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ అని పాత్రికేయుడు, ఎపిడబ్ల్యూజెఎఫ్ పట్టణ అధ్యక్షుడు వేగిరాజు రాధాకృష్ణ అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని క్విట్ ఇండియా స్థూపం వద్ద పాత్రికేయులు ఎపి గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులతో కలిసి అజాద్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ పిలుపును అందుకుని చిన్న వయసులోనే స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించిన చంద్రశేఖర్ ఆజాద్ కోర్టు శిక్షలకు చిన్న తనంలోనే గురయ్యారన్నారు. ఆయన పోరాటం విప్లవకారులకు ప్రజాస్వామ్యం, సమసమాజం, లౌకికవాదం కోరుకునే వారికి ఎంతో స్ఫూర్తి నిలుస్తుందన్నారు. పెన్షనర్స్ జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ఎన్.రాజు, జిల్లా ట్రెజరీ ఉద్యోగుల అధ్యక్షుడు యువి.పాండురంగరావు మాట్లాడారు. కార్యక్రమంలో పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు గాతల జేమ్స్, తాలుకా పెన్షనర్స్ కార్యదర్శి పి.సీతారామరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ యు.బాస్కరరావు, ఇసి మెంబర్ కెసిఆర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - ఆచంట

విద్యతోనే దేశం అభివృద్ధి చెందుతుందని సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు అన్నారు. వల్లూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. పదో తరగతిలో విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి ఊరికి, మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం, కెపిపాలెం గ్రామాల్లో ఈ నెల 28న బుధవారం విద్యుత్ సరఫరాకు ఏర్పడిందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బళ్ల సురేష్‌కుమార్ తెలిపారు. కెపిపాలెంలోని 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో నూతన, అదనపు 5ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పేరుపాలెం, కెపిపాలెం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని సురేష్ కుమార్ కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

యథేచ్ఛగా మట్టి పూడికలు..!

అధిక లోడులతో ట్రాక్టర్లు, లారీల రాకపోకలు
రోడ్లు ధ్వంసం
పట్టించుకోని అధికారులు
స్థానికుల ఆందోళన

పొలాన్ని ఆనుకుని వేసిన లేఅవుట్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వం అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్ట వేసేందుకు అనేక నిబంధనలు ప్రవేశపెట్టినప్పటికీ అవేమీ పట్టడం లేదు. అక్రమ సంపాదనే లక్ష్యంగా కొందరు మండలంలో జోరుగా మట్టి పూడికలు చేపడుతున్నారు. అయితే ఈ పనులకు అనుమతులు ఉన్నాయో లేదా అనేది చూడకుండానే అన్ని అనుమతులూ ఉన్నాయని అధికారులే బహిరంగ మట్టి మాఫియాకు బాసటగా నిలుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మండలంలోని కొవ్వాడ, అన్నవరం గ్రామ పరిధిలో 20 రోజుల నుంచి మట్టిపూడిక పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని కోట్లాది రూపాయలు విలువ చేసే రోడ్లు ధ్వంసమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మట్టి లోడులతో ట్రాక్టర్లు, లారీలు అధిక సంఖ్యలో అతివేగంగా వెళ్లడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఏ సమయంలో ఇటువంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా పెద్దగా హారన్లు కొడుతూ తమకు నిద్ర లేకుండా చేస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని, కాసులకు కక్కుర్తి పడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికే రెండు పంటలు పండే పంట భూములను బీడు భూములుగా మార్చేశారని, రియల్ ఎస్టేట్ పేరుజెప్పి మిగిలిన పంట భూములను కూడా బీడు భూములుగా మార్చేందుకు రియాల్టర్లు సిద్ధం కావడంతో వారికి అధికారులే అండగా నిలవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కొందరు రాజకీయ నాయకులు పలుకుబడి ఉపయోగిస్తే, మరికొందరు జిల్లా ఉన్నతాధికారులు తమ వెనుక ఉన్నారని చెబుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. అధికారులు కాసులకు కక్కుర్తి పడి రాజకీయ నాయకులపై నెపాన్ని నెట్టి వారు చేతులు దులుపుకుంటున్నారే విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్లు అధ్వానం..

మట్టి పూడికల వల్ల గ్రామాల్లో పంచాయతీ రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. అధిక మట్టి లోడులతో ట్రాక్టర్లు, లారీలు రాకపోకలు సాగించడంతో రోడ్లు కుంగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తవ్వకాలపై గ్రామ రెవెన్యూ అధికారిని వివరణ కోరగా ఆ స్థలాలకు కన్వర్షన్ కట్టేశారని, మైనింగ్ కూడా కట్టేశారని తెలిపారు. అయితే మైనింగ్ చెల్లించాలంటే పూడిక చేపట్టిన తర్వాత వాటి కొలతల ప్రకారం మైనింగ్ శాఖ అధికారులు లెక్కలు చూసి దాని ప్రకారం ఎంత కట్టాలో చెబుతారు. అయితే మట్టి పూడిక సాగుతుండగానే మైనింగ్ కట్టేశారని రెవెన్యూ అధికారి చెప్పడం ఎంత నిబద్ధతతో పనిచేస్తున్నారో తెలుస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఈ విషయమై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అంటున్నారు.

అంతర్జాతీ సదస్సులో ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకూ తాడేపల్లిగూడెంలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థుల బృందం రూపొందించి ప్రదర్శించిన ప్రాజెక్టుకు మొదటి స్థానం లభించడంతోపాటు రూ.పది వేల నగదు బహుమతి అందుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు ఆయా విద్యార్థుల బృందాన్ని మంగళవారం కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎన్.గోపాలకృష్ణమూర్తి, ప్రాజెక్ట్ మెంటర్ ఇఇఇ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కూరెళ్ల పవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఎనర్జీ మేనేజ్మెంట్ సిస్టం ఇన్ ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ ఫెసిలిటీస్ అనే అంశంపై ప్రాజెక్టు ఎక్స్పో ప్రదర్శించారన్నారు. తాడేపల్లిగూడెం శశి ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సుకు సుమారు వెయ్యి ప్రాజెక్టులు పరిశీలనకు రాగా అందులో 75 ప్రాజెక్టులను పరిశీలించి మొదటి స్థానం తమ కళాశాల విద్యార్థులు దీపిక, కె.సిరి చాతుర్య, డిజై.దుర్గా, పి.జేమ్స్, ఎఇవి.సాయి, వి.కుసుమ రేణుక, యు.సత్యసాయి బృందానికి బహుమతి వచ్చిందని చెప్పారు. విద్యార్థులను ఇఇఇ విభాగం హెడ్ డాక్టర్ బిఆర్‌కె వర్మ అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

మహిళా దినోత్సవ బ్రోచర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మార్చి 1 నుంచి 8వ తేదీ వరకూ శ్రీవిజ్ఞానవేదిక, ఇన్నర్ వీల్ క్లబ్, పట్టణ మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ బ్రోచర్లను పురపాలక సంఘ కమిషనర్ ఎం.శ్యామల మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. స్వాతంత్రోద్యమంలో మహిళలు వీరోచిత పాత్ర పోషించారన్నారు. మహిళా దినోత్సవ వేడుకలను వారోత్సవాలుగా నిర్వహించడం గొప్ప విశేషమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మార్చి 1 నుండి 8వ తేదీ వరకూ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామని, 1న డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభ సభ నిర్వహిస్తామని, 2 నుంచి 5వ తేదీ వరకూ పాఠశాలలు, కళాశాలలో మహిళా సాధికారితపై వివిధ పోటీలు నిర్వహిస్తామని 6, 7న పురపాలక సంఘం, మెప్మా మహిళా సంఘాలతో రంగవల్లుల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇన్నర్ వీల్స్ క్లబ్ కార్యదర్శి సామంతపూడి మణి, డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల గ్రంథాలయాధికారి కె.శిరీష, అలయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ కార్యదర్శి అల్లు వనజాక్షి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సరోజ మాట్లాడారు

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

వచ్చేనెల మూడో తేదీన పల్స్ పోలియే కార్యక్రమం నేపథ్యంలో గణపవరం పిహెచ్‌సి పరిధిలో 32 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి డాక్టర్ పి.సంతోష్ నాయుడు తెలిపారు మంగళవారం స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై వైద్య సిబ్బందికి, ఆరోగ్య కార్యకర్తలకు జరిగిన అవగాహనా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పల్స్ పోలియో జయప్రదానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తమ ఆసుపత్రి పరిధిలో ఉన్న 2019 మంది ఐదు సంవత్సరాల్లోపు పిల్లలందరికీ రెండు పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమం జయప్రదం కావడానికి 32 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్‌బాబు, ఎంఎల్‌హెచ్‌పిలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆచంట : పోలియోను సమూలంగా అరికట్టాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆచంట వేమవరం పిహెచ్‌సి వైద్యాధికారిని కె.సత్యవతి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పల్స్ పోలియోపై అవగాహనా కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మార్చి మూడో తేదీన నిర్వహించే పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆశా వర్కర్లకు, అంగన్వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మూర్తి బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శివరామరాజు ఫ్లెక్సీల చించివేతపై తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం

ప్రజాశక్తి - భీమవరం

ఉండి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు ఫ్లెక్సీలను చించేయడం పట్ల తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థి ప్రకటనతో టిడిపిలో ఏర్పడిన అసమ్మతి సెగల నేపథ్యంలో శివరామరాజు ఫ్లెక్సీలను చించడం చర్చనీయమైంది. ఇప్పటికే టిక్కెట్ వ్యవహారంలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్న శివరామరాజు ఫ్లెక్సీలు చించివేత సరైంది కాదని, కావాలనే రెచ్చగొడుతున్నారని తెలుగు తమ్ముళ్లు విమర్శిస్తున్నారు. భీమవరం- తాడేపల్లిగూడెం మార్గంలో గొల్లలకోడేరు గ్రామంలో ఏర్పాటు చేసిన శివరామరాజు ఫ్లెక్సీలను గుర్తుతెలియని ఆకతాయిలు సోమవారం రాత్రి చించివేశారు. తమ నాయకుని ఫ్లెక్సీలను కావాలనే చించివేశారని శివరామరాజు అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ప్రశాంతంగా ఉండే ఉండి టిడిపిలో అలజడిని సృష్టించడానికి కొందరు కావాలని ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

చూస్తూ ఊరుకోం..

పాలకోడేరు, కాళ్ల మండలంలో బ్యానర్లు చించేయడం దారుణమని ఉండి ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు అన్నారు. భీమవరంలోని మాజీ ఎంఎల్‌ఎ శివ రామరాజు కార్యాలయంలో సాంబశివరాజు మీడియాతో మాట్లాడారు. ఇటువంటి చర్యలకు తాము బెదిరిపోమని అలా అని ఫ్లెక్సీలను చించేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. నరసాపురం పార్లమెంట్ తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి బురిడి రవిబాబు టిఎన్ఎస్ఎఫ్ జనరల్ సెక్రటరీ మాంద్రు సందీప్, నాయకులు మేడిది శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంగీత ప్రియులకు చేరువయ్యేందుకే

సినీ రంగాన్ని ఎంచుకున్నా..

సంగీత దర్శకుడు దేవ్ జాండ్

నరసాపురం: తనకు సంగీతం అంటే ప్రాణమని, కోట్లాది మంది సంగీతప్రియుల అభిమానాన్ని, మనసులను గెలుచుకోవాలంటే సినీరంగం ఒక మార్గమని భావించి ఆ రంగంలో రాణించడానికి ప్రయత్నిస్తున్నానని సినీ సంగీత దర్శకుడు దెవ్ జాండ్ (ఈగల్ సినిమా మ్యూజిక్ డైరెక్టర్) అన్నారు. మంగళవారం నరసాపురం మండలం ఆయన స్వగ్రామం సరిపల్లి విచ్చేసిన సందర్భంగా ఆయన అభిమానులు, గ్రామస్తులు, స్నేహితులు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన కొంతసేపు మీడియాతో ముచ్చటించారు. తన బాల్యమంతా నరసాపురంలోనే గడిచిందని, కళాశాల విద్య మద్రాసు వైజాగ్ లోను ఉన్నత విద్యను అమెరికాలో పూర్తి చేశానని ఆయన అన్నారు. తన తండ్రి జోసఫ్ రాజుకు గిటారు, పియోనో వంటి వాయిద్యాలలో మంచి ప్రావీణ్యం ఉందన్నారు. తన తల్లిదండ్రులు స్వచ్ఛంద సంస్థలను నిర్వహిస్తున్నారని అన్నారు. తన అభిరుచులను కుటుంబ పరంగా ప్రోత్సహించడంతో తాను ఈ స్థాయికి రాగలిగానన్నారు. సినీ రంగంలో దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని తనకు మంచి మిత్రుడు అని అన్నారు. రవితేజ హీరోగా నటించి తాను సంగీతం అందించిన ఈగల్ చిత్రం విజయం సాధించడం తనలో నమ్మకాన్ని మరింత పెంచిందన్నారు. ఈ చిత్రానికి పని చేసిన మిగతా ఫ్రేమ్స్ అందరి సహకారం మరువలేనిది అని అన్నారు. కొత్త వాళ్లను ప్రోత్సహించడంలో హీరో రవితేజ ముందు వరుసలో ఉంటారన్నారు. అనంతరం గ్రామానికి విచ్చేసిన దెవ్ జాండ్‌ను గ్రామ సర్పంచి ఈదా సురేష్ బాబు, ఎంపీటీసీ చెన్నం వెంకట్రావు, గ్రామ పెద్దలు సత్కరించారు.



సంగీత దర్శకుడు దెవ్ జాండ్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

చిన్నారుకులకు గుండె వైద్య శిబిరం

భీమవరం రూరల్: బాలలకు సంబంధించిన గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహించారు. వసుధ ఫౌండేషన్ వారి సహకారంతో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ 15 సంవత్సరాల్లోపు వయసున్న పిల్లలను పరిశీలించి, 2డి ఎకో పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య చికిత్సలు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో జరిగేవి కొత్త తరహా ఎన్నికలని ఒక నియంతపై పోరాటం జరిగే ఎన్నికలని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు ఛాంబర్ కమ్యూనిటీ హాల్లో జరిగిన టిడిపి, జనసేన కార్యకర్తల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28న తాడేపల్లిగూడెంలో జరిగే టిడిపి, జనసేన మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఎన్నికల గడువు మరో 45 రోజులు మాత్రమే ఉందని దీనికి తగ్గట్టు వ్యూహం పన్నాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, జనసేన టిడిపి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఉండి: టిడిపి, జనసేన ఉమ్మడి ఐక్యతను చాటేందుకు నేడు తాడేపల్లిగూడెంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టిడిపి జనసేన శ్రేణులకు టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని టిడిపి, జనసేన నాయకులను కలిసి ఆయన మాట్లాడారు. తాడేపల్లిగూడెం సభలో పాల్గొని సభను విజయవంతం చేసేందుకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, జనసేన మండల అధ్యక్షులు ఎడవెల్లి వెంకటేశ్వరరావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న పాల్గొన్నారు.

గణపవరం : తాడేపల్లిగూడెంలో బుధవారం జరిగే టిడిపి, జనసేన సభకు మండలం నుంచి పదివేల మంది జనసేన, టిడిపి కార్యకర్తలు, వీర మహిళలు హాజరవుతున్నట్లు జనసేన మండల నాయకులు తోట శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. జనసేన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, నాయకులు పాల్గొన్నారు

తాడేపల్లిగూడెం : నేడు జరగనున్న జనసేన, టిడిపి ఉమ్మడి సభ విజయవంతం చేసేందుకు జనసేన నాయకులు తరలిరావాలని జనసేన తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు 20 వేల మందితో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు.

IN THE COURT OF HONOURABLE IV ADDL. JUNIOR CIVIL JUDGE AT: RAJAMAHENDRAVARAM
O.S NO: 659 /2023
Between:
State Bank of India, Bazar Branch, Rajahmundry, Rep. by its Branch Manager. ...Plaintiff
VS
Byreddy Avinash ...Defendant
SUMMONS
To:
Byreddy Avinash, S/O Rama Rao, D.NO:1-168, Reddyvari Street, Near Galigopuram Temple, Sanivarapupeta, ELURU.
Please take notice that the above plaintiff filed the suit against you for recovery of an amount Rs 1,06,968/- together with subsequent interest and other reliefs. The above suit stand posted **to 18-03-2024** for your appearance either in person or through a pleader on the above mentioned date in the said court at 10.30 A.M to answer the claim, failing which the matter will be disposed off as per law.
KANDUKURI SRINIVAS
SBI Panel Advocate
Rajamahendravaram
Cell: 9059549017

నేడు ఛాంబర్స్‌లో నూతన భవనాలు ప్రారంభం

పాలకొల్లు : పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో రూ.2 కోట్ల ఖర్చుతో నిర్మించిన నూతన భవనాలను ఈ నెల 28వ తేదీ బుధవారం ప్రారంభించనున్నారు. పలువురు దాతల సహకారంతో ఈ భవనాలను నిర్మించారు. సెక్రటరీ కలిదిండి రామరాజు బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేశారు. కలిదిండి జయలక్ష్మి, పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, అల్లూరి సీతారామరాజు, అల్లూరి విజయలక్ష్మి, చుండూరి దీన్ దయాల్‌తోపాటు పలువురు దాతల సహకారంతో బిల్డింగ్ నిర్మించారు. ఛాంబర్ అధ్యక్షుడు కారుమూరి నరసింహారావు, జనరల్ సెక్రటరీ దేవరపల్లి లక్ష్మీ నారాయణ, కోశాధికారి ఎన్‌వి.సత్యనారాయణమూర్తి, అడిషనల్ ఛైర్మన్ తటవర్తి కృష్ణ మూర్తి, కోశాధికారి జల్లూరి రామలింగేశ్వరరావు, ఛాంబర్ ఎడ్యుకేషన్ సొసైటీ తరపున కృషి చేశారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

భీమవరం రూరల్ : జిల్లాలో నిర్వహిస్తున్న స్వీప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రకాశంచౌక్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకుని అందరూ ఓటు హక్కు వినియోగించు కోవాలని కోరారు. జిల్లా స్వీప్ నోడల్ అధికారి జి సి హెచ్ ప్రభాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో భీమవరం ఎంపిడిఒ, డిఆర్‌డిఎ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయ షాపుల వేలం వాయిదా

నరసాపురం: పట్టణంలోని శ్రీ కపిల మల్లేశ్వరస్వామి వారి దేవస్థానానికి చెందిన 11 షాపుల వేలంపాట మార్చి 15 తేదీకి వాయిదా వేసినట్లు ఇఒ పులగం వేణుగోపాల్ తెలిపారు. ఆలయ అభివృద్ధి దృష్ట్యా మార్పులు చేసి వాయిదా వేసినట్లు తెలిపారు.

పాస్‌పోర్టు పడిపోయినది
విప్పర్తి జోషిబాబు, తండ్రి: శేఖర్ అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. **G7912077** గల పాస్‌పోర్టు ది. 26-02-2024వ తేదీన రెన్యూవల్ నిమిత్తం కంచుమర్రు గ్రామం నుండి అల్లిలి సెంటర్‌కు వెళ్ళి చూచుకొనగా నా పాస్‌పోర్టు కనబడలేదు. మార్గమధ్యలో ఎంత వెతికినా దొరకలేదు. దొరికినవారు ఈ క్రింది అడ్రసుకు తెలియపర్చగలరు.
చిరునామా: విప్పర్తి జోషిబాబు
తండ్రి: శేఖర్, డోర్ నెం. 1-31
పెదపేట, కంచుమర్రు
అత్తిలి మండలం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 7032160876

పాస్‌పోర్టు పోయినది
NALLIMILLI SHARADA అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 24-12-2012న **K9231958** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు కొండావారిపాలెం నుండి మొగల్తూరు ఎస్‌బిఐ బ్యాంకు వీధికి వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.
NALLIMILLI SHARADA
W/o. NALLIMILLI RATNARAJU
D.No. 7-46, Kondavaripalem
Mogaltur, Mogaltur Mandal
West Godavari District

In the Court of III Additional District Judge at Bhimavaram
O.S. 27/2023
Between:
ABIS Exports (India) Pvt. Ltd., ...Plaintiff
AND
Kopparthi Naveen, Proprietor, Naveen Chandra Enterprises Feeds & Needs. ...Defendant
To:
Kopparthi Naveen, Proprietor, Naveen Chandra Enterprises Feeds & Needs, S/o. (late) Satyanarayana, 4-5-1/1, Kovvada Center, 39th Ward, Durgapuram, Bhimavaram-2, Bhimavaram Mandal, West Godavari District, Andhra Pradesh - 534202.
పై నెంబరు గల కేసు మీ హాజరు నిమిత్తం 13-03-2024 నాటికి వాయిదా కలదు. కనుక ఆరోజు అనగా **13-03-2024** మీరు పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10.30 గం॥లకు** హాజరు కావలెను. లేని యెడల కోర్టు వారు మిమ్ములను Exparte చేసి తదుపరి విచారణ కొనసాగించెదరు.
(కోర్టు వారి ఆర్డరు ప్రకారం)
U.V.SUBRAHMANYAM
A.NATARAJ
విజయవాడ
26-02-24
Advocates for Plaintiff

In the Court of III Additional District Judge at Bhimavaram
I.A. 206/2023 in O.S. 27/2023
Between:
ABIS Exports (India) Pvt. Ltd., ...Plaintiff
AND
Kopparthi Naveen, Proprietor, Naveen Chandra Enterprises Feeds & Needs. ...Defendant
To:
Kopparthi Naveen, Proprietor, Naveen Chandra Enterprises Feeds & Needs, S/o. (late) Satyanarayana, 4-5-1/1, Kovvada Center, 39th Ward, Durgapuram, Bhimavaram-2, Bhimavaram Mandal, West Godavari District, Andhra Pradesh - 534202.
పై నెంబరు గల I.A. లో మీ హాజరు నిమిత్తం 13-03-2024 నాటికి వాయిదా కలదు. కనుక ఆరోజు అనగా **13-03-2024** మీరు పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10.30 గం॥లకు** హాజరు కావలెను. లేని యెడల కోర్టు వారు మిమ్ములను Exparte చేసి తదుపరి విచారణ కొనసాగించెదరు.
(కోర్టు వారి ఆర్డరు ప్రకారం)
U.V.SUBRAHMANYAM
A.NATARAJ
విజయవాడ
26-02-24
Advocates for Plaintiff